# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

తేది : **22-01-2026** సమయం : **6.45** గంటలు

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లాలో ఉక్కు కర్మాగారానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

2. తెలంగాణలో క్రీడా మైదానాల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తంచేసిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.

3. అవయవదానం గొప్ప సామాజిక బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

4. ఆంధ్రప్రదేశ్ లో శాంతి భద్రతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు.

==========================

ఆంధ్రప్రదేశ్ లోని అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఉక్కు కర్మాగారానికి వచ్చేనెల 15వ తేదీ తర్వాత శంకుస్థాపన చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి వివిధ పారిశ్రామికవేత్తలతో నిన్న సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ లాంజ్‌లో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్‌తో ముఖ్యమంత్రి సమావేశమైయ్యారు. ఈ ప్లాంటు ఏర్పాటుకు కావాల్సిన అనుమతులపై అక్కడ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తొలిదశలో దాదాపు 60 వేల కోట్ల రూపాయలతో కర్మాగారం ఏర్పాటు చేయనున్నారని తెలిపారు. శంకుస్థాపన సమయంలోగా అనుమతులు, భూసేకరణ వంటి అంశాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

-----------------------

తెలంగాణలో క్రీడా మైదానాల అభివృద్ధికి టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తంచేసిందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా ముఖ్యమంత్రితో టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్-2047, ప్రభుత్వ విధానాలను ఆయనకు ముఖ్యమంత్రి వివరించారు. యంగ్ ఇండియా క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు, 2036 ఒలింపిక్స్‌లో భారత్ పతకాలు సాధించేలా క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాల గురించి తెలియజేశారు. క్రీడా మైదానాల అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు చంద్రశేఖరన్ సంసిద్ధత వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి తెలిపారు.

----------------------

అవయవదానం గొప్ప సామాజిక బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండల పరిధిలోని పెదచందాల గ్రామానికి చెందిన జనసేన పార్టీ సభ్యుడు చందు వీర వెంకట వసంతరాయలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో అతని కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి నిన్న పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అవయవ దానానికి ముందుకొచ్చినందుకు వారిని అభినందించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ ,

వాయిస్..30 సెకన్లు

----------------------

రాష్ట్ర ఆర్థికవృద్ధికి, నిధుల సమీకరణలో వాణిజ్య పన్నుల శాఖ పాత్ర కీలకమని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, వాణిజ్య పన్నులు శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆ శాఖ అధికారులతో నిర్వహించిన కార్యశాలలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్ లో పన్ను వసూళ్ల వృద్ధి రేటు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ లో పన్నుల ఆదాయాన్ని పెంచేందుకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన సంస్కరణలు ప్రజలకు, వ్యాపారులకు అనుకూలమైనవని మంత్రి వివరించారు.

----------------------

ఆంధ్రప్రదేశ్ లో శాంతి భద్రతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో ఇద్దరు మధ్య వ్యక్తిగత కక్షలతో జరిగిన ఘర్షణను రాజకీయ పార్టీలకు ఆపాదించడం సరికాదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగే ఏ ఘటన జరిగినా పార్టీలకు అతీతంగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్.. 30 సెకన్లు

-----------------------

నంద్యాల జిల్లాలో జరిగిన ప్రవైటు బస్సు అగ్ని ప్రమాద ఘటనలో ముగ్గురు మృతి చెందారు. జిల్లాలోని శిరివెళ్ల మండలం శిరివెళ్లమెట్ట వద్ద అర్ధరాత్రి 2 గంటలకు ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్ మీదుగా దూసుకెళ్లి రోడ్డు అవతలివైపు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని దగ్ధమైందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్, క్లీనర్ మృతిచెందారని చెప్పారు. బస్సు కిటికీల్లోంచి దూకడంతో పదిమందికిపైగా ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారని, క్షతగాత్రులను నంద్యాల సర్వజన ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లో త్వరలో పాదయాత్రను ప్రారంభించనున్నట్లు మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ఏలూరు శాసనసభ నియోజకవర్గ

పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ఆయన నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,

వాయిస్ .. 25 సెకన్లు

-----------------------

తెలుగు వ్యవహార భాషా పితామహులు, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు వెంకట రామ్మూర్తి వర్ధంతి ఈ రోజు. శ్రీకాకుళంజిల్లా పర్వతాల పేటలో ఆగష్టు 29, 1863లో ఆయన జన్మించారు. గ్రాంధిక భాషలో వున్న తెలుగు వచనాన్ని ప్రజలవాడుక భాషలోకి తెచ్చి, నిత్య వ్యవహారంలో తెలుగు భాష, సొబగును అందరికీ తెలియజేశారు. బహు భాషావేత్త, చరిత్రకారుడు అయిన రామ్మూర్తి. సవరభాషను ప్రాచుర్యంలోకి తెచ్చి.. సవర పుస్తకాలు రాశారు. వ్యవహారిక భాష కోసం కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి జనవరి 22, 1940లో తుదిశ్వాస విడిచారు.

-----------------------

దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సంస్థ కీలకపాత్ర పోషిస్తోందని కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణి టెండర్ల ప్రక్రియ రద్దు అంశంపై ఆయన నిన్న ఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ, సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. సింగరేణి అక్రమాలపై చర్చ జరగాలన్నారు. సీబీఐ దర్యాప్తునకు తెలంగాణా ప్రభుత్వం ముందుకొస్తే కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

-----------------------

తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొంతమేర తగ్గినప్పటికి దట్టమైన పొగమంచు కురుస్తోందని వాతావరణ శాఖ తెలిపింది. పొగమంచుతో ప్రయాణీకుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో 5.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా... తెలంగాణాలోని ఆదిలాబాద్లో 13.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

-----------------------

ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లాలో "అమరజీవి జలధార పధకం" కింద ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జిల్లాలో అమరజీవి జలధార పధకం అమలుకు సంబంధిత అధికారులతో పాలకొల్లులో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గోదావరి నది డెల్టా ప్రాంతంలో భూగర్భజలాలు ఉప్పగా, కలుషితమవ్వడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. విజ్జేశ్వరం వద్ద గోదావరి నీటిని తీసుకుని శుద్ధి చేసి జిల్లా అంతటా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.

= = = = = = = = = = = = = = = =